ఆంధ్రజ్యోతి

5

ANDHRAJYOTHY

తమిళనాడు

TAMILNADU

గురువారం 6 నవంబరు 2025

డిసెంబర్ 8న పళని తిరు ఆవినన్‌కుడి

ఆలయ కుంభాభిషేకం



ముహూర్తపు రాటకు పూజలు - యాగకలశంతో ప్రదక్షిణ చేస్తున్న శైవపండితుడు

● ముహూర్తపు రాటతో శ్రీకారం

చెన్నై, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా పళని తిరుఆవినన్‌కుడి ఆలయ మహాకుంభాభిషేక వేడుకలు డిసెంబర్ 8న జరుగనున్నాయి. ఆ వేడుకల ప్రారంభ సూచనగా బుధవారం ఉదయం శుభ ముహూర్త స్తంభ స్థాపన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. భూ ప్రదక్షిణ చేసిన తనకు జ్ఞానఫలాన్ని ఇవ్వకుండా తలిదండ్రులను ప్రదక్షిణ చేసి విఘ్నేశ్వరుడు దక్కించుకోవడం పట్ల ఆగ్రహం చెందిన సుబ్రహ్మణ్యస్వామి కైలాసం వీడి పళని పర్వతమెక్కారు. అక్కడే కౌపీనధారుడై స్థిరనివాసమేర్పరచుకున్నారు. ఆ పళనిపర్వతం దిగువ కార్తికేయుడికి తిరుఆవినన్‌కుడి కూడా ఉంది. (తమిళంలో తిరు అంటే లక్ష్మి) కామధేనువు (ఆ) సూర్యుడు (ఇనన్), భూదేవి (కు), అగ్ని దేవుడు (డి) ఆ క్షేత్రంలోని బాల కుమారస్వామిని ఆరాధించడం వల్ల ఈ క్షేత్రానికి 'తిరుఆవినన్‌కుడి' అనే పేరొచ్చింది. ఈ ఆలయంలో కుమారస్వామి బాలకుమారుడిగా మయూరవాహనంపై భక్తులను అనుగ్రహిస్తున్నారు. పళని పర్వతాలయంలోని దండాయుధపాణి దర్శనానికి వెళ్లే భక్తులు కొండ దిగువనున్న ఈ ఆలయాన్ని దర్శించడం ఆనవాయితీ. ఇంతటి కీర్తి సంతరించుకున్న ఈ ఆలయ మహాకుంభాభిషేకం 2014 సెప్టెంబర్ 7న జరిగింది. ఈ నేపథ్యంలో కుంభాభిషేకం జరిగి 12 యేళ్లు పూర్తికానుండటంతో ఆ ఆలయానికి కుంభాభిషేకం నిర్వహించాలని నిర్వాహకులు నిర్ణయించారు. ఆ మేరకు డిసెంబరు 8న కుంభాభిషేకం చేసేందుకు జూన్ 16న ఆలయ జీర్ణోద్ధరణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం, ఉభయదారుల సంయుక్త ఆధ్వర్యంలో రూ.కోటికి పైగా నిధులతో పనులు జరిగాయి. ఈ నేపథ్యంలో యాగశాలల నిర్మాణం కోసం శుభ ముహూర్త స్తంభ స్థాపన కార్యక్రమం బుధవారం ఉదయం నిర్వహించారు. ముందుగా యాగం, ఆరాధన జరిపిన మీదట ముహూర్త స్తంభాన్ని శైవాగముపండితులు, ఆలయ ప్రధానార్చకుల మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ ముహూర్త స్తంభాన్ని నాటారు. ఈ కార్యక్రమంలో పళని ఎమ్మెల్యే సెంథిల్‌కుమార్, మున్సిపల్ డిప్యూటీ చైర్మన్ కందసామి, ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేష్, సహాయ కమిషనర్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

14 జిల్లాలకు వర్ష సూచన

ప్యారీస్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తన ప్రభావంతో రానున్న రెండ్రోజులు రాష్ట్రంలోని 14 జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని ప్రాంతీయ వాతావరణ కేంద్రం ప్రకటించింది. నుంగంబాక్కం కాలేజీ రోడ్డులోని రీజనల్ మెట్రాలాజికల్ సెంటర్ (ఆర్ఎంసీ) బుధవారం వర్షాలపై విడుదల చేసిన వివరాల మేరకు, ఉత్తర, దక్షిణ తమిళనాడులో కొన్నిప్రాంతాలు, పుదుచ్చేరి, కారైక్కాల్‌లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. కృష్ణగిరి, ధర్మపురి, నామక్కల్, సేలం, పెరంబలూర్, తిరుచ్చి, అరియలూర్, మైలాడుదురై, నాగపట్నం, తిరువారూర్, తంజావూరు, పుదుకోట, శివగంగ, రామనాథపురం జిల్లాలు, కారైక్కాల్‌లలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని, సముద్ర వాతావరణంలో ఎలాంటి మార్పులు లేనందున మత్స్యకారులు చేపలవేటకు వెళ్లొచ్చని ఆర్ఎంసీ తెలిపిం ది.

కరూర్ దుర్ఘటన..

ముగ్గురు ఎస్ఐల విచారణ

ప్యారీస్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ రోడ్‌షో సందర్భంగా తొక్కిసలాటలో 41 మంది మృతిచెందిన సంఘటనపై దర్యాప్తు జరుపుతున్న సీబీఐ అధికారులు బుధవారం ముగ్గురు ఎస్ఐలను నాలుగు గంటలపాటు విచారణ జరిపారు. సెప్టెంబర్ 27న విజయ్ పాల్గొన్న రోడ్‌షోలో జరిగిన తొక్కిసలాట ఘటనపై ఐపీఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలోని సీబీఐ బృందం దర్యాప్తు సాగిస్తోంది. ఇంత వరకు ఘటనా స్థలం, పరిసర ప్రాంతాల షాపుల యజమానులను విచారించిన సీబీఐ, స్థానికులను కూడా విచారిస్తోంది. అదేవిధంగా వేలుచామిపురంలో బందోబస్తుకు వెళ్లిన 12 మంది కానిస్టేబుళ్లు, 10 మంది ఎస్ఐలు 22 మందికి సమన్లు పంపించారు. ఆ మేరకు మంగళవారం ఉదయం 12 మంది కానిస్టేబుళ్లు, 7 మంది ఎస్ఐలు సీబీఐ అధికారుల ముందు హాజరయ్యారు. అయితే విచారణకు తగిన సమయం లేనందువల్ల చివరి నిమిషంలో వచ్చిన ముగ్గురు ఎస్ఐలను బుధవారం విచారణ జరిపినట్లు సీబీఐ అధికారులు తెలిపారు.

తిరువణ్ణామలైలో గిరిప్రదక్షిణ

పోటెత్తిన భక్తజనం



ప్యారీస్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఐప్పసి పౌర్ణమిని పురస్కరించుకుని అగ్నిక్షేత్రంగా ప్రసిద్ది చెందిన తిరువణ్ణామలైలో లక్షలాది మంది భక్తులు రెండో రోజైన బుధవారం గిరిప్రదక్షిణ చేశారు. ఈ శైవ క్షేత్రంలో ప్రతి నెల పౌర్ణమి రోజున లక్షలాది మంది భక్తులు స్వామివారి దర్శనం చేసుకున్న తర్వాత 14 కిలోమీటర్ల గిరిప్రదక్షిణలో పాల్గొంటారు. ఆ మార్గంలో ఉన్న అష్టలింగ సన్నిధులు, రమణమహర్షి ఆశ్రమం, పచ్చయమ్మన్ ఆలయం తదితర సన్నిధుల వద్ద కర్పూరం వెలిగించి తమకు శుభాలు చేకూరాలని ప్రార్థిస్తుంటారు. ఈ నేపథ్యంలో, తమిళ ఐప్పసి నెల అశ్విణి నక్షత్రం రోజున అన్నామలైయార్‌కు అన్నాభిషేకం చేయడం సంప్రదాయం. ఆ మేరకు ఆలయ ప్రాంగణంలో ఐదు ప్రాకారాల్లో ఉన్న కల్యాణ సుందరేశ్వరుడి సన్నిధుల్లో స్వామివారికి మంగళవారం సాయంత్రం అన్నాభిషేకం నిర్వహించారు. బుధవారం వేకువ జామున 5గంటలకు గోపూజచ అమ్మవారి సమేత స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ఉదయం 5.30 గంటల నుండి భక్తులను క్యూలైన్ల ద్వారా దర్శనానికి అనుమతించారు. గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తుల సౌకర్యార్థం 9 ప్రాంతాల నుండి ప్రత్యేక బస్సులను రాష్ట్రంలోని పలు జిల్లాలు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ రాష్ట్రాల ప్రభుత్వ రవాణా సంస్థలు నడిపాయి. పౌర్ణమి సందర్భంగా రద్దీ పెరిగిన కారణంగా సుమారు 500 మందికి పైగా పోలీసులతో తిరువణ్ణామలైలో బందోబస్తు నిర్వహించారు.

మినీ టైడల్ పార్కులతో స్థానికులకు ఉపాధి

● ముఖ్యమంత్రి స్టాలిన్

● రాశిపురం, వేలూరుల్లో ఏర్పాటు



ఏజీఎస్ హెల్త్ కేర్‌కు వేలూరు టైడల్ పార్క్ లీజు పత్రాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానికులకు ఉపాధి కల్పించేలా పలు జిల్లాల్లో మినీ టైడల్ పార్కులను ప్రారంభిస్తున్నట్టు ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. బుధవారం వేలూరు, రాశిపురంలో మినీ టైడల్ పార్క్‌లను సీఎం ప్రారంభించారు. రాష్ట్రంలో ప్రధాన నగరాలైన చెన్నై, కోవై సహా కొన్ని నగరాల్లో మాత్రమే ఐటీ సంస్థలు, టైడల్ పార్క్‌లున్నాయి. దీంతో, ఇతర జిల్లాల పట్టభద్రులు నగరాలకు వచ్చి ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ క్రమంలో, ఆయా జిల్లాల్లోనే నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా అన్ని జిల్లాల్లో మినీ టైడల్ పార్క్‌లు ఏర్పాటుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం సచివాలయం బుధవారం జరిగిన కార్యక్రమంలో వేలూరు అబ్దుల్లాపురంలోని నిర్మించిన మినీ టైడల్ పార్క్ ప్రారంభించిన ముఖ్యమంత్రి, నామక్కల్ జిల్లా రాశిపురంలో మినీ టైడల్ పార్క్‌కు శంకుస్థాపన చేశారు. ఆ ప్రకారం, వేలూరు అబ్దుల్లాపురంలో నిర్మించిన టైడల్ పార్క్‌ను ఏజీఎస్ హెల్త్ కేర్‌కు లీజుకు ఇస్తూ సంస్థ నిర్వాహకులకు పత్రాలను సీఎం అందజేశారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ మంత్రి దురైమురుగన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రి టీఆర్‌బీ రాజా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

తిరుచెంగోడు ప్రభుత్వాస్పత్రి...

తిరుచెంగోడు ప్రభుత్వాసుపత్రి హోదా పెంచుతూ 2023లో జీవో విడుదల చేసిన ప్రభుత్వం, భవన నిర్మాణాలకు 23 కోట్లు కేటాయించింది. ఆ ప్రకారం, నాలుగు అంతస్తులు, 225 పడకల వసతితో కూడిన అప్‌గ్రేడ్ చేసిన తిరుచెంగోడు ప్రభుత్వానిని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, బుధవారం సచివాలయంలో జరిగిన కార్యక్రమాలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు.

పునరావాస విభాగాలపై సమీక్ష...

జనరల్, పునరావాస శాఖ చేపట్టిన పథకాలను ముఖ్యమంత్రి స్టాలిన్ సచివాలయంలో బుధవారం సమీక్షించారు. విదేశాల్లో పనిచేస్తూ అనుకోకుండా మరణించే తమిళుల కుటుంబాలకు నెలవారీ పింఛన్ అందించే పథకం, శ్రీలంక తమిళులు సొంతంగా వ్యాపారాలు ప్రారంభించేందుకు రుణాలు, శ్రీలంక తమిళులకు సురక్షితమైన, నాణ్యమైన వసతి కల్పించేలా రెండో దశలో 18 జిల్లాల్లోని 34 శిబిరాల్లో 3,919 ఇళ్లు నిర్మించే పథకం సహా పలు అంశాలపై సీఎం స్టాలిన్ ఆ శాఖ ఉన్నతాధికారులతో చర్చించారు.

విద్యార్థులకు రూ.10 వేల ప్రోత్సాహకం

హిందూ దేవాదాయ శాఖ నిర్వహిస్తున్న అర్చక, నాదస్వర దివ్య ప్రబంధ పాఠశాల సహా 18 పాఠశాలల్లో పూర్తికాల శిక్షణ పొందుతున్న 297 మందికి తలా రూ.10వేలు, పార్ట్ టైం శిక్షణ పొందుతున్న 66 మంది విద్యార్థినీ, విద్యార్థులకు తలా రూ.5,000 సీఎం ప్రోత్సాహక వేతనం అందజేశారు. సచివాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఒక్కో విద్యార్థిని రూ.10వేల చెక్కులను సీఎం అందజేశారు.



దేవాదాయ శాఖ పాఠశాలల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థినికి ప్రోత్సాహక వేతనం అందిస్తున్న సీఎం

పరందూర్ విమానాశ్రయానికి

వెయ్యి ఎకరాల భూసేకరణ పూర్తి



ప్యారీస్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో విమాన ప్రయాణికుల అవసరాల కోసం కాంచీపురం జిల్లా పరందూర్‌లో రెండో విమానాశ్రయం నిర్మించనున్నారు. దీనికి సంబంధించిన ప్రకటన విడుదలై భూ సేకరణ కూడా జరుగుతోంది.. నూతన విమానాశ్రయ పథకం కోసం పరందూర్, పరిసరాల్లోని 13 గ్రామాల్లో 5,183 ఎకరాల భూ సేకరణ చేపడుతున్నారు. అయితే ఈ భూ సేకరణను వ్యతిరేకిస్తూ పరందూర్, ఏకనాపురం తదితర గ్రామాల ప్రజలు చేపట్టిన ఆందోళన కొనసాగుతూనే ఉంది. అయినప్పటికీ కొత్త విమానాశ్రయ నిర్మాణం పనులను అధికారులు ముమ్మరం చేశారు. భూ సేకరణకు ఒక తరుపువారు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో మరో వర్గం ప్రజలు తమ భూములను విమానాశ్రయం కోసం అందజేస్తున్నారు. జూలై 9వ తేదీ పరందూర్, నెల్‌వాయిల్, పోడవూర్, అక్కమాపురం, వలత్తూరు అనే 5 గ్రామాలకు చెందిన 19 మంది తమ భూములను రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఆ విధంగా గత సెప్టెంబర్ వరకు 12 గ్రామాలకు చెందిన 441 మంది 566 ఎకరాలను అప్పగించగా, ఈ నెలలో ఇప్పటివరకు 1000 ఎకరాల భూ సేకరణ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. దానికి నష్టపరిహారంగా రూ.400 కోట్లు అందజేసినట్లు తెలిపారు. మిగతా భూముల సేకరణ పనులను వేగవంతం చేయనున్నట్లు జిల్లా యంత్రాంగం తెలిపింది.

కూటమి గురించి ప్రస్తావించొద్దు

● అన్నాడీఎంకే శ్రేణులకు ఈపీఎస్ సూచన



ఈపీఎస్‌కు స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

ప్యారీస్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి గురించి బహిరంగ వేదికలు, సమావేశాలు, టీవీషోలో ప్రస్తావించవద్దని, ఎన్నికలకు పార్టీ శ్రేణులంతా సిద్ధం కావాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) సూచించారు. రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాలిగైలో బుధవారం ఆ పార్టీ జిల్లా కార్యదర్శుల సమావేశం ఈపీఎస్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి పార్టీ కార్యాలయానికి వచ్చిన ఈపీఎస్‌ను కార్యకర్తలు ఘనంగా స్వాగతించారు. అనంతరం ఈపీఎస్ పార్టీ కార్యాలయ ప్రాంగణంలోని మాజీముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. చెన్నై నుంచి కన్నియాకుమారి వరకు అన్ని జిల్లాల పార్టీ కార్యదర్శులు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్న ఈ సమావేశంలో ఈపీఎస్ మాట్లాడుతూ 2026 అసెంబ్లీ ఎన్నికల కూటమి గురించి ఎవరూ కూడా బయట ప్రస్తావించొద్దని, పార్టీ తరపున బూత్ కమిటీ పనులను వేగవంతం చేయడంపై దృష్టిసారించాలని సూచించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సర్ ప్రక్రియను ఆయా ప్రాంతాల నాయకులు పరిశీలించాలన్నారు. పార్టీ నిబంధనలకు ప్రతి ఒక్కరు కట్టుబడి, అనుబంధ విభాగాల నాయకులను కలుపుకుని విజయమే లక్ష్యంగా ఎన్నికల విధుల్లో చురుగ్గా పాల్గొనాలని ఈపీఎస్ పార్టీ శ్రేణులను కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి



సీఎం సార్.. సుప్రీం మొట్టికాయలు మరిచారా ?

● కరూర్ సంఘటనపై కపట నాటకాలా ? ● టీవీకే సర్వసభ్యమండలి సమావేశంలో విజయ్ ధ్వజం

చెన్నై, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కరూర్ దుర్ఘటనపై సుప్రీం కోర్టు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక డీఎంకే న్యాయవాదులను ముప్పుతిప్పలు పడిన విషయాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ మరచిపోయినట్లుందని తమిళగ వెట్రి కళగం (టీవీకే) నాయకుడు విజయ్ అన్నారు. మానవత్వం లేకుండా ముఖ్యమంత్రి స్టాలిన్ రాజకీయ చెలగాటమాడుతున్నారని, డీఎంకే ప్రభుత్వంపై ఉంచుకున్న నమ్మకాన్ని రాష్ట్ర ప్రజలు ఎప్పుడో గోతిలో పూడ్చి పెట్టేశారని విమర్శించారు. తమిళగ వెట్రి కళగం ప్రత్యేక సర్వసభ్యమండలి సమావేశం మహాబలిపురంలోని ఓ స్టార్ హోటల్‌లో బుధవారం జరిగింది. కరూర్ రోడ్‌షోలో తొక్కిసలాటలో 41 మంది మృతి చెందటంతో గత 38 రోజులుగా సైలెంట్ మోడ్‌లో ఉన్న టీవీకే ఉన్నట్టుండి తన రాజకీయ బద్ధశత్రువు డీఎంకే విమర్శలు చేయడం ఆరంభించింది. సర్వసభ్యమండలి సమావేశంలో విజయ్ ప్రసంగిస్తూ భారతదేశంలో ఎవరికీ విధించినంతగా కఠిన నిబంధనలు తన ఎర్యటనలపై విధిస్తున్నారని, కుత్సిత బుద్ధి కలిగిన ముఖ్యమంత్రి స్టాలిన్‌కు కొన్ని ప్రశ్నలు అడగదలిచానని, కరూర్ దుర్ఘటన తర్వాత పోలీసు ఉన్నతాధికారులు హడావిడిగా మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఎందుకు వివరణ ఇచ్చారో బదులివ్వాలన్నారు. సంఘటన జరిగిన కొన్ని గంటల్లోనే ఏకసభ్య విచారణ సంఘాన్ని ఎందుకు ఏర్పాటు చేశారని విజయ్ ప్రశ్నించారు. కరూర్ దుర్ఘటనకు సంబంధించి స్టాలిన్ చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలని, ఎవరూ అడగకుండానే ఏక సభ్య కమిషన్ ఎలా ఏర్పాటు చేశారంటూ సుప్రీంకోర్టు సైతం డీఎంకే ప్రభుత్వాన్ని నిలదీసిందన్నారు. వాస్తవాలను తెలియజేయడానికే తాను శాసనసభలో వివరణ ఇచ్చానంటూ స్టాలిన్ చాకచక్యంగా మాట్లాడారని విజయ్ విమర్శించారు. నాటకీయంగా అన్ని వ్యవహారాలను నడిపివారిపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిందని. స్టాలిన్ చెప్పినవన్నీ అసత్యాలు కనుకనే ఏకనాయకత్వ విచారణ సంఘానికి సైతం మొట్టికాయలు వేసిందన్నారు. సుప్రీం కోర్టు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక డీఎంకే న్యాయవాదులంతా మౌనం పాటించారని విజయ్ ఆరోపించారు. ఇలా అడుగడుగునా స్టాలిన్ కపటనాటకాలు ఆడుతూ వచ్చారని, కపటనాటకాలాడటం డీఎంకేకు కొత్త కాదని, 1972లోనే పార్టీ అధిష్ఠాన్ని ప్రశ్నించినవారిని ముప్పుతిప్పలు పెట్టిందని గుర్తు చేశారు. ప్రస్తుతం డీఎంకేని నిలదీసేలా తామడగాల్సిన ప్రశ్నలన్నింటినీ సుప్రీం కోర్టే అడిగిందన్నారు. ఇప్పటికైన ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోకపోతే డీఎంకే ప్రభుత్వానికి ప్రజలలే చక్కటి గుణపాఠం చెబుతారు. ఆ తర్వాత ఓటమిని సహించలేక ప్రజా తీర్పు శిరసా వహిస్తామంటూ ఓ ప్రకటన చేసి అరివాలయంలో డీఎంకే నేతలంతా దాక్కుంటారని విజయ్ యెద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలంతా టీవీకే వైపై మొగ్గుచూపుతున్నారని, అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఘనవిజయం సాధించి అధికారంలోకి రావటం ఖాయమని, కనుక డీఎంకే నేతలు 'ప్రజాతీర్పును శిరసా వహిస్తాం' అనే పాత ప్రకటన సిద్ధం చేసుకుంటే మంచిదని విజయ్ విమర్శించారు.

12 తీర్మానాల ఆమోదం

టీవీకే ప్రత్యేక సర్వసభ్య మండలి అసెంబ్లీ ఎన్నికల పొత్తుపై నిర్ణయాలు తీసుకునే అధికారాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్‌కు అప్పగించడం, ఆయనే సీఎం అభ్యర్థి తదితర 12 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. కోవైలో విద్యార్థినిపై జరిగిన గ్యాంగ్‌రేప్ నిందితులకు కఠిన శిక్ష విధించాలని, రాష్ట్రంలో మహిళలకు భద్రత పెంచాలని ఈ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. డెల్టా జిల్లాల్లో రైతుల నుంచి సకాలంలో ధాన్యం కొనుగోలు చేయని పాలకుల వైఖరిని తప్పుబట్టింది. రోడ్‌షో, బహిరంగ సభల్లో విజయ్ పాల్గొనేందుకు తగిన భద్రత కల్పించాలని, రాష్ట్ర పారిశ్రామిక రంగానికి సమీకరించిన పెట్టుబడులు, వాటి ద్వారా ఉద్యోగ అవకాశాలు పొందిన వారి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని ఈ సమావేశం తీర్మానం ఆమోదించింది.



సమావేశానికి హాజరైన ప్రతినిధులు



అభివాదం చేస్తున్న విజయ్

సమాచార దర్శిని

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శుక్రవారం (ఈ నెల 7వ తేది) ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఈ మేరకు విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే ప్రాంతాల వివరాలు...

అంబత్తూర్: పళినియప్ప పుదూర్, ఏకే అమ్మన్, భాను నగర్, ఒరగడం, మురుగంబేడు, పసుంపొన్ నగర్, కళ్లికుప్పం, చంద్రశేఖరపురం, వెంకటాపురం, కారుక్కు.

తిరుముడివాక్కం: సిడ్కో 6,8 వీధులు, మెయిన్ రోడ్డు మరియు లైన్, వేలాయుధం నగర్, మీనాక్షి నగర్, సతీష్ నగర్, కలైమగళ్ నగర్, సాయిబాబా లైన్, కర్పగం నగర్, 400 అడుగుల రోడ్డు పార్కింగ్ యార్డు ఏరియా, ఆశ్రమం అవెన్యూ.

రేపు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్, ఆవడి, పెరంబూర్ తదితర ప్రాంతాల్లో గురువారం ఉదయం 11 గంటలకు విద్యుత్ సమస్యల పరిష్కార శిబిరాలు జరుగనున్నాయి. ఎగ్మూర్ పరిధిలో వెప్పేరి ఈవీకే సంపత్ రోడ్డులోని సబ్ స్టేషన్, ఆవడి పరిధిలో ఎస్ఎం నగర్‌లోని మురుగప్ప పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని ఉప విద్యుత్ కేంద్రం, పెరంబూర్ పరిధిలో సింప్సన్ ఎదురుగా ఎంఈఎస్ రోడ్డులోని ఉప విద్యుత్ కేంద్రం ప్రాంగణాల్లో ఈ శిబిరాలు జరుగనున్నాయి. ఆయా ప్రాంతాల వినియోగదారులు విద్యుత్ సమస్యలకు పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

ఇంజనీరింగ్ కళాశాలలకు నోటీసులు

పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో, ఒకే ప్రొఫెసర్ ఒకటికి పైగా కళాశాలల్లో పనిచేస్తూ మోసానికి పాల్పడుతున్నారనే విషయం 2023లో వెలుగులోకి వచ్చింది. విచారణలో... 295 ఇంజనీరింగ్ కళాశాలల్లో పనిచేస్తున్న 700 మందికి పైగా ప్రొఫెసర్లు, పలు కళాశాలల్లో పనిచేస్తున్నట్లు నకిలీగా నమోదుచేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై విచారణకు అన్నా విశ్వవిద్యాలయం ఒక కమిటీని నియమించింది. కమిటీ విచారణలో భాగంగా, నకిలీ ప్రొఫెసర్లు పనిచేసిన, 140 ఇంజనీరింగ్ కళాశాలలు సంజాయిషీ ఇవ్వాలని కోరుతూ నోటీసులు జారీచేసింది.

'కారుణ్య' ఉద్యోగాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో మృతిచెందిన ప్రభుత్వ ఉద్యోగుల వారసులకు కారుణ్య ప్రాతిపదికన నియామకాలకు 'ఆన్‌లైన్'లో మాత్రమే దరఖాస్తులు స్వీకరించాలని తమిళనాడు సివిల్ సర్వీసెస్ (కారుణ్య నియామకం) నిబంధనలు సవరించారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... విధి నిర్వహణలో మృతిచెందిన ప్రభుత్వ ఉద్యోగుల వారసులకు కారుణ్య ప్రాతిపదికన ఉద్యోగాల్లో నియమిస్తుంటారు. ఈ నియామకాలు కోసం దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం జీవో విడుదల చేశారు. ఈ వెబ్‌సైట్ గత నెల 31వ తేది నుంచి అందుబాటులోకి వచ్చింది. కారుణ్య ప్రాతిపదికన ఉద్యోగాలు కోరుతూ ఈ వెబ్‌సైట్ ద్వారా మాత్రమే దరఖాస్తులు సమర్పించాలని జీవోలో పేర్కొన్నారని సచివాలయం తెలిపింది.

మెట్రోరైళ్లలో సైకిళ్లకు అనుమతి లేదు

పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మెట్రోరైళ్లలో సైకిళ్లు తీసుకెళ్లేందుకు అనుమతి లేదని చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) ఒక ప్రకటనలో తెలిపింది. నగరంలోని మెట్రోరైళ్లలో ప్రయాణించే కొందరు ప్రయాణికులు, రైలు దిగిన తర్వాత తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు సైకిళ్లు వాడుతున్నారు. అందుకోసం, సైకిళ్లను మెట్రోరైళ్లలో తీసుకెళ్తుంటారు. ప్రస్తుతం మెట్రోరైళ్లలో ప్రయాణించేవారి సంఖ్య అధికమైంది. రైళ్లలో ప్రయాణికులకు ఇబ్బంది కలిగించేలా సైకిళ్లు ఉంటున్నాయనే ఫిర్యాదులతో, మెట్రోరైళ్లలో సైకిళ్లు తీసుకెళ్లరాదని సీఎంఆర్ఎల్ తెలియజేసింది.

8న పాత్రికేయులకు ప్రత్యేక వైద్య శిబిరం

పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాత్రికేయులకు ప్రత్యేక వైద్యశిబిరం ఈ నెల 8వ తేది కలైవానర్ ఆడిటోరియంలో జరుగనుంది. ముఖ్యమంత్రి ఉత్తర్వులతో, ప్రజా సంబంధాలు, ఆరోగ్య శాఖ, చెన్నై ప్రెస్ క్లబ్, అపోలో హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ శిబిరంలో ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, వార్తా సంస్థల్లో పనిచేసే ఎడిటర్లు, అసిస్టెంట్ ఎడిటర్లు, చీఫ్ రిపోర్టర్లు, రిపోర్టర్లు, ఫొటోగ్రాఫర్లు, కెమెరామెన్‌లు పాల్గొనవచ్చు. ఉదయం 9.15 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరాన్ని ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం, హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబులు ప్రారంభించనున్నారు. శిబిరంలో రక్తపోటు, మూత్రపిండాలు, ఎకో, ఈసీజీ, జనరల్ మెడిసిన్, గుండె, నేత్రాలు సహా పలురకాల వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు అందిస్తారని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

తాత్కాలిక జెండా స్తంభాలకు

అనుమతి పొందాల్సిందే: జీసీసీ



ప్యారీస్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలు తాత్కాలిక జెండా స్తంభాలను ఏర్పాటు చేసేందుకు తప్పనిసరిగా అనుమతి పొందాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా బహిరంగ ప్రాంతాలు, జాతీయ, రాష్ట్ర రహదారులు, స్థానిక సంస్థలకు చెందిన ప్రాంతాల్లో అనుమతి లేకుండా, రాజకీయ పార్టీలు, కులసంఘాలు, మత సంస్థలు, కార్మిక సంఘాలు ఏర్పాటుచేసిన జెండా స్తంభాలను ఏప్రిల్ 28లోగా తొలగించాలని మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ గత జనవరిలో ఉత్తర్వులు జారీచేసింది. ఈ పనులను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కమిటీలను నియమిస్తూ జీవో కూడా విడుదల చేసింది. అదే విధంగా రాజకీయ పార్టీలు, సంఘాల తరుపున నిర్వహించే కార్యక్రమాలకు జెండా స్తంభాలు ఏర్పాటు చేసే సమయంలో వాహనాలకు, పాదచారులకు ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలని నిబంధనలు విధించింది. ఈ నేపథ్యంలో, జీసీసీ పరిధిలోని 200 వార్డుల్లో తాత్కాలిక జెండా స్తంభాల ఏర్పాటుకు ముందుగానే అనుమతి పొందాలని, కార్యక్రమం అయిన వెంటనే వాటిని ఆయా ప్రాంతాల నుండి తొలగించాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి.

బాలికపై అత్యాచారం కేసులో వృద్ధుడికి 20 ఏళ్ల జైలు

పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు సమీపంలో ఐదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన వృద్ధుడికి 20 ఏళ్ల కఠినకారాగార శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. 2024లో కోయంబేడు పోలీసు స్టేషన్ పరిధిలోని ఐదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు బాలిక తల్లి కోయంబేడు మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసు విచారించిన పోలీసులు, ఈ ఘటనకు కారణమైన 65 ఏళ్ల వృద్ధుడిని అరెస్ట్ చేశారు. ఈ కేసు హైకోర్టు ప్రాంగణంలోని పోక్సో కేసుల ప్రత్యేన న్యాయస్థానంలో విచారణ ముగిసిన నేపథ్యంలో, నేరం నిరూపణ కావడంతో నిందితుడికి (ప్రస్తుతం 66 ఏళ్లు) 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ మంగళవారం న్యాయమూర్తి తీర్పు వెలువరించినట్లు నగర పోలీసు శాఖ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

విద్యార్థినిపై అత్యాచారం

● తాతామనవళ్ల కోసం గాలింపు

ప్యారీస్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లాలో పదో తరగతి విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడి పరారైన తాత, మనువడి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నామక్కల్ జిల్లాకు చెందిన 17 ఏళ్ల బాలిక ఆతూర్ ప్రాంతంలోని బామ్మ ఇంట్లో ఉంటూ చదువుకుంటోంది. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న బాలికను క్లాస్ టీచర్ ప్రశ్నించగా, ఆమెపై అత్యాచారం జరిగినట్లు తెలిసింది. టీచర్ వెంటనే సేలం జిల్లా చిన్నారుల సంరక్షణ విభాగం అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విద్యార్థినిని విచారిస్తే జూన్ నెలలో తాత పెరియస్వామి (80), రెండ్రోజుల తర్వాత 16యేళ్ల మనవడు ఈ ఐదు నెలల్లో పలు మార్లు అత్యాచారానికి పాల్పడినట్లు తెలిసింది. బాధితురాలి వాఙ్మూలం ఆధారంగా తాత, మనువళ్లపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. చిన్నారిని సేలంలోని పిల్లల సంరక్షణ కేంద్రానికి తరలించిన పోలీసులు పరారీలోవున్న నిందితుల కోసం గాలిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● ఇద్దరికి గాయాలు

తిరుత్తణి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆగివున్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతిచెందగా బాలిక సహా ఓ వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లాలోని కార్వేటినగరానికి చెందిన కాశయ్య (52) ఓ షుగర్ ఫ్యాక్టరీలో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం తిరువళ్లూరు జిల్లా పాండ్రవేడు గ్రామంలో ఉన్న తన బంధువు ఇంటికి తన సోదరుడి కుమార్తె మీనాక్షి, అత్త లలితమ్మను తన బైక్‌పై తీసుకెళ్లాడు. తిరిగి వస్తుండగా అదుపుతప్పిన బైక్, రోడ్డుపక్కన నిలిపి ఉంచిన ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కాశయ్య అక్కడికక్కడే మృతిచెందగా, మీనాక్షి, లలితమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రి తరలించారు. ఈ ఘటనపై పొదటూర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వీఏఓ పోస్టుల భర్తీపై తాత్కాలిక స్టే

● హైకోర్టు ఉత్తర్వులు

అడయార్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 218 గ్రామ నిర్వహణ అధికారుల (వీఏఓ) పోస్టులను ప్రత్యక్ష నియామకం ద్వారా భర్తీచేసేందుకు హైకోర్టు తాత్కాలిక స్టే విధించింది. తమిళనాడు గ్రామ నిర్వహణాధికారుల సంఘం ప్రధానకార్యదర్శి అరుళ్‌రాజ్, వీఏఓ అహ్మద్ వయాజ్ హైకోర్టు మదురై బెంచ్‌లో దాఖలుచేసిన పిటిషన్‌లో...రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఖాళీగా ఉన్న 218 వీఏఓ పోస్టుల భర్తీకి సెప్టెంబరు 1 నుంచి 15వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరించారన్నారు. జిల్లాస్థాయిలో వీఏఓల బదిలీ అనంతరం ఖాళీ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఇదే కోరికతో దాఖలైన పిటిషన్ విచారించిన హైకోర్టు, వీఏఓల సీనియారిటీ పరిగణలోకి తీసుకోకుండా, సర్వీసులో చేరిన తేది ఆధారంగా జిల్లా బదిలీ దరఖాస్తులు పరిగణలోకి తీసుకోవడం తప్పు అంటూ నిషేధం విధించిందన్నారు. ఈ పరిస్థితుల్లో 218 ఖాళీ పోస్టుల భర్తీకి టీఎన్‌పీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిందని, ఈ కారణంగా బదిలీ కోసం పలు ఏళ్లుగా వేచి ఉన్న వారు అవకాశం కోల్పోతారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్ విచారించిన న్యాయమూర్తి జస్టిస్ కుమరేష్‌బాబు, జిల్లా బదిలీలు నిర్వహించకుండా వీఏఓ పోస్టుల భర్తీ చేయకూడదని నిషేధం విధించారు. ఈ పిటిషన్‌పై రెవెన్యూ శాఖ కమిషనర్, టీఎన్‌పీఎస్సీ చైర్మెన్లు అఫిడవిట్లు దాఖలుచేయాలని నోటీసులు జారీ చేసి, తదుపరి విచారణ ఈ నెల 14వ తేదీకి వాయిదావేశారు.

వీధికుక్కలకు కు.ని కేంద్రం

● కొన్ని పథకాలకు అనుమతివ్వాల్సిందే: హైకోర్టు

అడయార్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమం కోసం కొన్ని పథకాలకు అనుమతివ్వాల్సిందేనని మద్రాసు హైకోర్టు స్పష్టంచేసింది. వీధికుక్కల సంతానోత్పత్తి నియంత్రించేలా, వాటికి శస్త్రచికిత్సల కోసం ఏర్పాటుచేయనున్న కేంద్రానికి వ్యతిరేకంగా ఆవడికి చెందిన శివకుమార్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. జంతువుల సంక్షేమ బోర్డు మార్గదర్శకాలకు వ్యతిరేకంగా జనావాస ప్రాంతాల్లో ఇలాంటి కు.ని కేంద్రాలు నిర్మాణాలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎంఎం శ్రీవాస్తవ, జస్టిస్ అరుళ్ మురుగన్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. రూ.51లక్షలతో ఏర్పాటుకానున్న ఈ కేంద్రంలో వందలసంఖ్యలో కుక్కలను తరలించనున్నారన్నారు. ఇక్కడ ఎలాంటి వసతులు ఏర్పాటుచేయలేదని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. తగినభద్రతతో కుక్కల కు.ని చికిత్స నిర్వహించనున్నామని, ఈప్రాంతాన్ని కార్పొరేషన్ కేటాయించిందని ప్రభుత్వ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇరు తరపు వాదనల అనంతరం ప్రజల సంక్షేమంకోసం కొన్ని పథకాలకు అనుమతివ్వాల్సిందేనని ధర్మాసనం స్పష్టంచేసింది. తగిన భద్రతా చర్యల నడుమ కేంద్రం ఏర్పాటుచేస్తున్నారని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేదని, అభివృద్ధి కోసం చేపట్టే పనులను అక్రమమైనవిగా భావించలేమన్న ధర్మాసనం, పిటిషన్ తోసిపుచ్చుతూ ఉత్తర్వులు జారీచేసింది.

తొమ్మిదేళ్ల బాలికపై వీధిశునకం దాడి

పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మదురవాయల్ సమీపంలో వీధి కుక్క దాడిలో బాలికకు తీవ్రగాయాలయ్యాయి. మేట్టుకుప్పం ఓంశక్తి నగర్‌కు చెందిన సభానాయగం కుమార్తె లక్షణ (9) మంగళవారం ఇంటి సమీపంలోని దుకాణానికి వెళ్తున్న సమయంలో, హఠాత్తుగా వీధి కుక్క ఆమెపై దాడిచేసింది. బాలిక కేకలు విన్న చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని, బాలికను పోరూర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

కాంట్రాక్ట్ బిల్లు మంజూరుకు రూ.1.20 లక్షల లంచం

● ముగ్గురు కలెక్టరేట్ ఉద్యోగుల అరెస్ట్

పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణానికి కాంట్రాక్ట్ బిల్లు విడుదల చేసేందుకు రూ.1.20 లక్షలు లంచం ఆశించిన ముగ్గురు కలెక్టర్ కార్యాలయ ఉద్యోగులను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. రామనాథపురం జిల్లాలో ఓ కాంట్రాక్టర్ పరమకుడి ప్రాంతంలో రోడ్డు నిర్మాణానికి టెండరు దక్కించుకున్నాడు. పనులు పూర్తికావడంతో బిల్లు మంజూరు చేయాలని కలెక్టర్ కార్యాలయంని గ్రామీణాభివృద్ధి శాఖ ఇంజనీరింగ్ విభాగం సీనియర్ సర్వేయర్ వీరశేఖరన్‌ను సంప్రదించాడు. కాంట్రాక్ట్ మొత్తంలో ఒక శాతం కమీషన్‌గా ఇవ్వాలని వీరశేఖరన్, జూనియర్ సర్వేయర్ నాగలింగం స్పష్టం చేశారు. లంచం ఇచ్చేందుకు ఇష్టపడని కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. అధికారుల సూచనల మేరకు మంగళవారం సాయంత్రం రసాయనాలు పూసిన రూ.1.20 లక్షలను జూనియర్ సర్వేయర్ నాగలింగంకు అందజేశాడు. అతను అసిస్టెంట్ అరుణ్‌కు అందజేయగా, అతను వీఆరశేఖరన్‌కు అందించారు. ఆ సమయంలో అక్కడే మాటువేసిన అధికారులు, ముగ్గురిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని విచారిస్తున్నారు. అలాగే, సూపర్‌వైజింగ్ ఇంజనీరింగ్ కార్యాలయంలోని పత్రాలు, కంప్యూటర్లను అధికారులు పరిశీలిస్తున్నారు.

భూ తగాదా హత్య కేసులో

ఒకే కుటుంబంలో నలుగురికి యావజ్జీవం

ప్యారీస్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): భూ తగాదాలో కార్మికుడిని దారుణంగా హతమార్చిన కేసులో ఒకే కుటుంబంలోని నలుగురికి పెరంబలూర్ కోర్టు యావజ్జీవ శిక్ష విధించింది. పెరంబలూరు జిల్లా కున్నం మండలం ఏలుమురైకు చెందిన అరసన్ (55) అనే కార్మికుడికి, అదే ప్రాంతానికి చెందిన సెల్వరాజ్ భార్య లత మధ్య ఏర్పడిన భూ వివాదం కారణంగా రెండు కుటుంబాల మధ్య తరచూ గొడవలు జరిగినట్లు సమాచారం. 2018లో మళ్లీ జరిగిన గొడవలో లత, ఆమె తండ్రి రాజేంద్రన్ (57) కుమారుడు అరివళగన్ (28), కార్తిక్ (25) కర్రలతో దాడి చేయడంతో అరసన్ మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు లత సహా నలుగురిని అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన విచారణ పూర్తికావడంతో బుధవారం పెరంబలూర్ కోర్టు న్యాయమూర్తి పద్మనాభన్ హత్యకు పాల్పడిన నలుగురికి యావజ్జీవ శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. దీంతో పోలీసులు లతను తిరుచ్చి మహిళా జైలుకు, మిగతా వారిని సెంట్రల్ జైలుకు తరలించారు.

ఫిర్యాదుదారుడిపై దాడి కేసులో..

ఎస్ఐ, ముగ్గురు కానిస్టేబుళ్లకు రూ.5 లక్షల జరిమానా

పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వ్యక్తిపై దాడిచేసిన ఎస్ఐ, ముగ్గురు కానిస్టేబుళ్లకు మానవ హక్కుల కమిషన్ రూ.5 లక్షల జరిమానా విధించింది. కోవై జిల్లా పొల్లాచ్చి మహాలింగపురానికి చెందిన కృష్ణకుమార్ 2022లో మద్రాసు హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లో... రేషన్ దుకాణంలో జరుగుతున్న అవినీతికి సంబంధించి ఫిర్యాదు చేశానన్నారు. కానీ, రేషన్ దుకాణం ఉద్యోగి అసత్య ఆరోపణల ఆధారంగా మహాలింగపురం పోలీసులు తనపై కేసు నమోదుచేసి, దాడి చేశారని పేర్కొన్నాడు. ఈ విషయమై మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేశానని, తనకు న్యాయం జరిగేలా మానవ హక్కుల కమిషన్‌కు ఉత్తర్వులు జారీచేయాలని పిటిషన్‌లో కోరాడు. ఈ కేసు విచారించిన న్యాయస్థానం పిటిషనర్ ఫిర్యాదుపై విచారించి చర్యలు చేపట్టాలని మానవ హక్కుల కమిషన్‌ను ఆదేశించింది. ఆ ప్రకారం, విచారణ చేపట్టిన కమిషన్ సభ్యులు కన్నదాసన్ మంగళవారం జారీచేసిన ఉత్తర్వుల్లో వివరాలు ఇలా ఉన్నాయి... పిటిషనర్ కృష్ణకుమార్‌పై మహాలింగపురం పోలీసులు దాడిచేయడం మానవ హక్కుల ఉల్లంఘన అని, రేషన్ దుకాణ ఉద్యోగిపై ఫిర్యాదు చేస్తే, పిటిషనర్‌పై కేసు నమోదుచేసి అతడిని అరెస్ట్ చేయడంలో మానవ హక్కుల ఉల్లంఘన జరిగినట్టు నిర్ధారణ అయిందని, అందువల్ల పిటిషనర్ కృష్ణకుమార్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు పరిహారం చెల్లించాలన్నారు. అందులో అప్పట్లో మహాలింగపురం స్టేషన్ ఎస్ఐ శివకుమార్, హెడ్ కానిస్టేబుల్ జగదీష్‌బాబు నుంచి తలా రూ.2 లక్షలు, కానిస్టేబుళ్లు ఆనందన్, సెల్వగణేష్ తదితరుల నుంచి తలా రూ.50,000 వసూలుచేయాలని ఉత్తర్వులు జారీచేసింది. అలాగే, నలుగురిపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని కమిషన్ పోలీసు శాఖను ఆదేశించింది.

బస్సు డ్రైవర్ ఆత్మహత్యాయత్నం !



డ్రైవర్‌పై నీరుపోసి కాపాడుతున్న డిపో నిర్వాహకులు

తిరుత్తణి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బస్సు మైలేజీ తక్కువ వస్తుందని ప్రభుత్వ బస్ డిపో మేనేజర్ తిట్టడంతో బస్సు డ్రైవర్ ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలిలా.. తిరువళ్లూరు జిల్లా పొదటూర్‌పేటలో హేమాద్రి అనే వ్యక్తి ప్రభుత్వ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో డీజిల్‌కు సమానమైన మైలేజీ రావడంలేదని ఆ డిపో మేనేజర్ జ్ఞానశేఖరన్ డ్రైవర్ హేమాద్రిని ప్రశ్నించడంతో మనస్తాపం చెందిన హేమాద్రి డిపో బయట ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన డిపో యూనియన్ నాయకులు హేమాద్రిపై నీళ్లు పోసి అడ్డుకున్నారు. అనంతరం డ్రైవర్ మాట్లాడుతూ, బస్సుల్లో లీటర్ డీజిల్‌కు కేవలం 3.5 కిలోమీటర్లు వస్తుందని, కానీ మేము వేగంగా బస్సు నడిపి లీటర్‌కు 4.69 కిలోమీటర్లు వచ్చేలా వ్యవహరిస్తున్నామని, అయినప్పటికీ డిపో మేనేజర్ జ్ఞానశేఖరన్ లీటరుకు 6 కిలోమీటర్ల మైలేజీ రావాలని గత కొన్ని రోజులుగా ఒత్తిడి చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. సమాచారం అందుకున్న జిల్లా రవాణాశాఖ అధికారులు ఈ వ్యవహారంపై విచారణ చేపట్టారు.

రూ.55 కోట్లతో 729 ఆరోగ్య కేంద్రాలకు మరమ్మతులు

పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 729 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప ఆరోగ్యకేంద్రాల్లో రూ.55 కోట్లతో మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ మేరకు ఆరోగ్య శాఖ అధికారులు మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా 2,336 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 9,335 ఉప ఆరోగ్య కేంద్రాలున్నాయన్నారు. వీటిలో కొన్ని సొంత భవనాలు, కొన్ని అద్దె భవనాల్లో ఉన్నాయన్నారు. పాత, శిథిలమవుతున్న భవనాలకు మరమ్మతులు చేపట్టేలా ప్రతి ఏడాది నిధులు కేటాయిస్తుంటామని తెలిపారు. ఆ ప్రకారం, ఈ ఏడాది రూ.55 కోట్లు విడుదల చేశామన్నారు. ఈ నిధులతో 394 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 335 ఉప ఆరోగ్య కేంద్రాల్లో మరమ్మతులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

లంక శరణార్థులకు ఓటు హక్కు కల్పించాలి

● పీఎంకే నేత రాందాస్


ప్యారీస్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీలంక నుంచి శరణార్థులుగా వచ్చి ప్రత్యేక శిబిరాల్లో ఉంటున్న తమిళులకు ఓటు హక్కు కల్పించాలని పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ డిమాండ్ చేశారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ శ్రీలంకలో సైన్యం, ఎల్టీటీఈల మధ్య 1983లో యుద్ధం జరిగిన కారణంగా అక్కడున్న తమిళకుటుంబాలు ఆస్తులు వదులుకుని రాష్ట్రానికి శరణార్థులుగా వచ్చారన్నారు. సుమారు లక్షమందికి పైగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన 117 ప్రత్యేకశిబిరాల్లో ఏళ్లతరబడి నివసిస్తున్నారని, వారు స్వేచ్ఛగా జీవించేలా ఓటు హక్కు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకోవల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

కొత్తగా 13 ప్రాథమిక పాఠశాలల ప్రారంభం

పెరంబూర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో ప్రకటించిన విధంగా, 13 ప్రాథమిక పాఠశాలలు కొత్తగా ప్రారంభించడం, నాలుగు ప్రాథమిక పాఠశాలలను మాధ్యమిక పాఠశాలలుగా హోదా పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. తిరువణ్ణామలై జిల్లా పాలియపట్టు, వేలూరు జిల్లా కుప్పూర్, చిన్నఎత్తుపట్టి, కృష్ణగిరిజిల్లా కదూరు, కాట్టూరు, తిరుపత్తూర్ జిల్లా ఉదయరాజపాళయం, మదురై జిల్లా చెట్టికుళం, విరుదునగర్ జిల్లా ఇళంథిరై కొండన్, ఎం.చొక్కలింగపురం ప్రాంతాల్లో ప్రాథమిక పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. నాగపట్టణం జిల్లా దేతకూడి, నామక్కల్ జిల్లా ఆరిక్కాడు, కాంచీపురం జిల్లా కావూరు, పెరియార్ నగర్, తిరువళ్లూర్ జిల్లా ఆవడి కార్పొరేషన్ 31వ వార్డు తదితర ప్రాంతాల్లోను ప్రారంభం కానున్నాయి. వేలూరు జిల్లా గుండురాణి, చిన్నఅల్లాపురం, విల్లుపురం జిల్లా కన్నికాపురం, నాగపట్టణం జిల్లా టాటా నగర్ ప్రాంతాల్లో ప్రాథమిక పాఠశాలలను మాధ్యమిక పాఠశాలలుగా హోదా పెంచారు. అందుకు అవసరమైన నిధులు, ఉపాధ్యాయులపోస్టులను ప్రభుత్వ ఆమోదించిందని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

సముద్రంలో దిగి నిరసన

● పారిశుధ్య కార్మికుల అరెస్ట్



సముద్రంలో దిగి నిరసన తెలుపుతున్న మహిళలు

ప్యారీస్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ)లోని ఐదు, ఆరు జోన్లలో పనిచేస్తున్న మహిళా పారిశుధ్య కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం గత 97 రోజులుగా రకరకాలుగా నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. కాగా, బుధవారం ఉదయం మెరీనా తీరంలో సముద్రంలో దిగి వినూత్నంగా నిరసన తెలిపారు. జీసీసీ పరిధిలోని ఐదు, ఈ రెండు జోన్లలో చెత్త సేకరణ పనులను ప్రైవేటు సంస్థకు అప్పగించిన జీసీసీ తీరును ఖండిస్తూ గత మూడు నెలలుగా తాత్కాలిక పారిశుధ్య కార్మికులు సమ్మె, నిరాహారదీక్ష, రాస్తారోకో, ధర్నా తదితర నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఇదిలా వుండగా, సుమారు 50 మందికి పైగా మహిళా పారిశుధ్య కార్మికులు మెరీనా బీచ్‌లో హఠాత్తుగా సముద్రంలో దిగి జీసీసీ వైఖరిని ఖండిస్తూ నినాదాలు చేశారు. అక్కడ ఉన్న పోలీసులు ఆందోళనకారులను అరెస్ట్ చేశారు.

ఎరువుల కర్మాగారంలో లీకైన అమోనియా

● మనలి ప్రజల అవస్థలు



పరుగులు తీస్తున్న ప్రజలు

ప్యారీస్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మనలి ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని ఎరువుల కర్మాగారంలో మంగళవారం రాత్రి అమోనియా వాయువు లీకడంతో స్థానికులు కళ్లు మంటలు, ఊపిరాడక తీవ్రంగా ఇబ్బంది పడ్డారు.. ముఖాలకు గుడ్డకట్టుకుని దాదాపు 2గంటలపాటు గడిపారు. అమోనియా వాయువు లీకవడంతో మనలి రౌండ్ థానా జంక్షన్‌లో ట్రాఫిక్ పోలీసులు కళ్లమంటలను భరిస్తూనే విధులు నిర్వహించారు. రాత్రి 10 గంటల సమయంలో ఈ సమస్య గురించి కాలుష్య నియంత్రణ మండలి అధికారికి సమాచారం తెలియజేశారు. వెంటనే నిపుణుల బృందం సంఘటనా స్థలానికి చేరుకుని ఎరువుల ఫ్యాక్టరీలో వాయువు లీకైన పరికరాన్ని పరిశీలించారు. ఈ కర్మాగారంలో వినియోగించే అమోనియా ముడిపదార్థాలు పొగగొట్టం ద్వారా అధికంగా బయటికి వెళ్లినందున ఆ వాయువు గాలిలో కలిసి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందని, దీనివల్ల ప్రజల ఆరోగ్యానికి ఎలాంటి ప్రమాదం ఉండదని వారు స్పష్టంచేశారు. దాదాపు గంటపాటు శ్రమించి లీకేజీ సమస్యను పరిష్కరించారు.

అధికార మార్పునకు ప్రజలు సిద్ధం...!

● టీఎంసీ అధినేత జీకే వాసన్

పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారం మార్పునకు ప్రజలు సిద్ధమయ్యారని తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ) అధ్యక్షుడు జీకే వాసన్ అభిప్రాయపడ్డారు. తిరువొత్తియూర్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న జీకే వాసన్ మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై ప్రజల్లో అవగాహన కల్పించేలా అన్ని రాజకీయ పార్టీలు కృషిచేయాలన్నారు. తమకు మంచి పాలన అందించే వారిని ప్రజలు ఎన్నుకుంటున్నారన్నారు. కానీ, కోవైలో విద్యార్థినిపై జరిగిన ఘటనతో, రాష్ట్రంలో అధికార మార్పు జరగాలని ప్రజలు కోరుకుంటున్నారని జీకే వాసన్ తెలిపారు.

వాహనం ఢీకొని చిరుత మృతి



మృతిచెందిన చిరుతను పోస్టుమార్టానికి తరలిస్తున్న దృశ్యం

ప్యారీస్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా విక్రవాండి జాతీయ రహదారిలో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ చిరుత పులి మృతి చెందినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. విక్రవాండి టోల్ ప్లాజా సమీపంలో ఉన్న జాతీయ రహదారిలో రోడ్డు దాటేందుకు యత్నించిన చిరుతను అటువైపు వెళ్లిన ఓ వాహనం ఢీకొంది. ఈ ఘటనలో చిరుతపులి అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం తెలిసి సంఘటనా స్థలానికి చేరుకున్న అటవీశాఖ అధికారులు మృతి చెందిన చిరుతను పోస్టుమార్టంకు తరలించారు. దీనిపై అందజేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణమైన వాహనం వివరాల కోసం ప్రయత్నిస్తున్నారు.

మినీ ఐటీ పార్కు ప్రారంభం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి తదితరులు

వేలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అబ్దుల్లాపురంలో 5 ఎకరాల్లో రాష్ట్రప్రభుత్వం రూ.32కోట్లతో నూతనంగా నిర్మించిన మినీ ఐటీ పార్క్‌ను బుధవారం ఉదయం ముఖ్యమంత్రి స్టాలిన్ వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రారంభించగా, స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్, జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి పాల్గొని వేదిక ప్రాంగణంలో జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల ఉన్నతాధికారులు, డీఎంకే నిర్వాహకులు పాల్గొన్నారు.

అన్బుమణి వర్గీయులపై చర్యలు తీసుకోండి

● ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు



ఎస్పీ కార్యాలయం బయట పీఎంకే నిర్వాహకులు

వేలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) నేత రాందాస్ వర్గీయులపై దాడులకు పాల్పడుతున్న అన్బుమణి వర్గీయులపై చర్యలు తీసుకోవాలని జిల్లా పీఎంకే అధ్యక్షుడు సారథి వేలూరు జిల్లా ఎస్పీ కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, వేలూరు సమీపంలోని అనైకట్టు వీరప్పన్‌పట్టిలో రాందాస్ వర్గీలపై అన్బుమణి వర్గీయుల దాడిచేశారని, దీనితో ఆగ్రహించిన రాందాస్ వర్గీయులు ఉసూర్‌లో అన్బుమణి మద్దతుదారుడైన వ్యక్తిపై దాడికి చేశారని ఇలా ఒకరిపై ఒకరు పరస్పరం దాడికి పాల్పడుతున్నారని, ఈ దాడులు మొదలుపెట్టిన అన్బుమణి మద్దతుదారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కోట జలకంఠేశ్వరాలయంలో కలెక్టర్



ఆలయ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాల కారణంగా వేలూరు జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురవడంతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. వేలూరు కోట ప్రాంగణంలోని జలకంఠేశ్వరాలయంలో వర్షపు నీరు నిలిచి భక్తులు ఇబ్బందులు పడుతున్నారన్న సమాచారంతో బుధవారం ఉదయం కలెక్టర్ సుబ్బులక్ష్మి ఆలయ పరిసరాలను పరిశీలించారు. వర్షాలకు నీటమునిగిన ప్రాంతాలను పరిశీలించిన ఆమెతో ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ, స్వామివారి రథం నిలిపే టెంట్ వద్ద గత కొన్నేళ్లుగా పురావస్తుశాఖ అధికారులు పరిశోధనలు చేస్తుండటంతో 4 ఏళ్లుగా ఆలయం వెలుపల రథాన్ని వుంచారని కలెక్టర్‌కు తెలిపారు. దీనిపై తక్షణ చర్యలు తీసుకుని రథానికి ప్రత్యేక గదిని నిర్మించాలని వినతిపత్రం అందజేశారు. ఇందులో ఆమెతో పాటు ఎమ్మెల్యే కార్తికేయన్, మేయర్ సుజాత సహా పలుశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నన్ను బీజేపీ నడిపించడం లేదు

● ఎమ్మెల్యే సెంగోట్టయన్

అడయార్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజకీయ జీవితంలో 53 ఏళ్లుగా ప్రయాణిస్తున్నానని, తనను బీజేపీ నడిపిస్తుందనే వార్తల్లో అర్థం లేదని అన్నాడీఎంఏ బహిష్కృత ఎమ్మెల్యే సెంగోట్టయన్ స్పష్టం చేశారు. కోవై విమానాశ్రయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... అన్నాడీఎంకేలో ఏం జరుగుతుందో అందరికి తెలిసిన విషయమన్నారు. అలంకుళం అన్నాడీఎంకే ఎమ్మెల్యే మనోజ్‌పాండియన్ డీఎంకే పార్టీలో చేరడం ఆయన తీసుకున్న నిర్ణయమన్నారు. ప్రస్తుతం అన్నాడీఎంకేను పళినిస్వామి కుమార్తె, బావమరిది తదితరులు నడిపిస్తున్నారని ఆరోపించారు. అన్నాడీఎంకేలో ఉన్న పలువురు నేతలను సంప్రదిస్తున్నానని, ప్రస్తుతం వారు ఎవరనే విషయం తాను ఇప్పుడు చెప్పలేనన్నారు.



అన్నానగర్ టవర్ విశేషాలను వివరిస్తూ..



ఆ కుడ్య చిత్రాలు

చరితకు సజీవ సాక్ష్యాలు




మన సంప్రదాయ నృత్యకేళి



సంగీత కళాకారులు

ఆ కుడ్య చిత్రాలు చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఒకనాటి సంప్రదాయాలతో పాటు అనాదిగా నగరం ఎదిగిన తీరు, ఇక్కడి రవాణా సదుపాయాల మెరుగుదల, నగరంలో ప్రసిద్ధి చెందిన ప్రాంతాల గొప్పతనాన్ని, రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన కళల ప్రాశస్త్యాన్ని చాటి చెబుతూ నగర వాసిని మేల్కొలిపేలా, సాధారణ వ్యక్తిని సైతం ఆలోచింపజేసేలా కుడ్యాలపై ఆవిష్కృతమయ్యాయి. నగర ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనతో పాటు కళల్ని ప్రోత్సహించడంలో తన వంతు కృషి చేస్తున్న గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ).. నేటి తరానికి నాటి చరిత్ర తెలియజేప్పేలా గోడలపై రూపొందించిన చిత్రాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సెంట్రల్ రైల్వే స్టేషన్, ఎగ్మూరు, వాషర్‌మెన్‌పేట తదితర ప్రాంతాల్లో గోడలపై కళాకారులు మలచిన ఈ చిత్రాలు సాధారణ పౌరుల జీవనశైలిని మన కళ్లముందుంచుతున్నాయి. కళాకారులు ముందు చూపు, కళానైపుణ్యంతో నగరవాసులు, పర్యాటకుల్లో ఆసక్తిని, ఆలోచనలు రేకెత్తించే విధంగా ఈ చిత్రాలను రూపొందించారు. నిత్యజీవితంలో ఉదయం నుంచి రాత్రి వరకు సగటు మనిషి నెరవేర్చాల్సిన బాధ్యతలు, శాస్త్రీయ, జానపద కళాకారుల జీవినం విధానం, అవగాహన కల్పించే వాచకాలు సందర్శకులను కట్టిపడేస్తున్నాయి.

- ప్యారీస్, ఆంధ్రజ్యోతి



పారిశుధ్య కార్మికులు - వివేకానంద హౌస్

పురుషుల జూనియర్ హాకీ వరల్డ్ కప్ ట్రోఫీ ఆవిష్కరణ

పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలిసారిగా 14వ పురుషుల జూనియర్ హాకీ వరల్డ్ కప్ పోటీలు ఈ నెల 28 నుంచి డిసెంబరు 10వ తేది వరకు చెన్నై, మదురైలో జరుగనున్నాయి. తమిళనాడు క్రీడాభివృద్ధి కమిషన్, భారత హాకీ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.44.36 కోట్లు కేటాయించింది. మేయర్ రాధాకృష్ణన్ హాకీ స్టేడియం, మదురైలో ఉన్న తమిళనాడు క్రీడాభివృద్ధి కమిషన్ హాకీ స్టేడియంలలో జరుగనున్న ఈ పోటీల్లో 24 దేశాల జట్లు పాల్గొనున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో జూనియర్ హాకీ వరల్డ్ కప్ ట్రోఫీని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి అతుల్య మిశ్రా, తమిళనాడు క్రీడాభివృద్ధి కమిషన్ మెంబర్ సెక్రటరీ జె.మేఘనాథ రెడ్డి, భారత హాకీ సంఘం ఛైర్మెన్ దిలీప్ టిర్కీ, కార్యదర్శి భోలానాథ్ సింగ్, కోశాధికారి శేఖర్ మనోహరన్ తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీని ఆవిష్కరిస్తున్న సీఎం స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం తదితరులు



వ్రతంలో పాల్గొన్న దంపతులు



వ్రతానికి హాజరైన సంఘ నిర్వాహకులు

మొగప్పేరు తెలుగు సంఘం ఆధ్వర్యంలో

సామూహిక సత్యనారాయణ వ్రతం

ప్యారీస్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తిక పౌర్ణమి సందర్భంగా మొగప్పేరు తెలుగు కల్చరల్ అండ్ సోషియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. మొగప్పేరు ప్రాంతంలోని సంతాన శ్రీనివాస పెరుమాళ్ సత్సంఘ్ మండపంలో ఉదయం 9.30గంటలకు గణపతి పూజతో పౌర్ణమి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వేదికపై సత్యనారాయణస్వామి చిత్రపటం ఉంచి 365 వొత్తులతో దీపాలను వెలిగించారు. ఉపవాసంతో ఉన్న 60 మంది దంపతులు సంప్రదాయ వస్త్రధారణతో ఈ పూజల్లో పాల్గొన్నారు. సంఘం అధ్యక్షులు డా.గిరి హనుమంత రావు, నిర్వాహకులు వీవీబీ రావు, కె.మోహన్‌నాయుడు, డీజే సురేష్‌బాబు, ఇ.సురేష్‌బాబు, ఎన్. నిర్మల్ చెందర్, ఇతర కార్యనిర్వాహక సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులందరికి అన్నప్రసాదాలు, ముత్తయిదువులకు పసుపు కుంకుమలు అందజేశారు.



'పరాశక్తి' సాంగ్ ప్రోమో రిలీజ్

యువనటుడు శివకార్తికేయన్ 25వ చిత్రం 'పరాశక్తి' సుధాకొంగర దర్శకత్వంలో డ్వాన్ పిక్చర్స్ బ్యానర్‌పై ఆకాష్ భాస్కరన్ నిర్మిస్తున్నారు. శ్రీలీల హీరోయిన్‌గా అధర్వా, రవి మోహన్, ఫాసిల్ జోసెఫ్ ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. సుమారు 150 కోట్ల బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. సంక్రాంతికి విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో 'పరాశక్తి' సాంగ్ ప్రోమోను మంగళవారం విడుదల చేశారు. శివకార్తికేయన్, శ్రీలీల డ్యాన్స్ చేస్తున్న ఆ సాంగ్ ప్రోమో నెటిజన్లను బాగా ఆకట్టుకుంది.

చిత్రజ్యోతి

అజిత్ మూవీలో విజయ్‌సేతుపతి, రాఘవ లారెన్స్?



'గుడ్ బేడ్ అగ్లీ' మూవీ తర్వాత మళ్ళీ అజిత్‌కుమార్ నటిస్తున్న 'ఏకే 64' చిత్రానికి ఆదిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. జనవరిలో ఈ చిత్రానికి సంబంధించిన అన్ని వివరాలను అధికారికంగా ప్రకటిస్తానని అజిత్ ఇటీవల తెలిపారు. ఈ మూవీకి అజిత్ భారీగా రెమ్యునరేషన్ తీసుకున్నట్లు కోలీవుడ్ వర్గాలు కోడై కూస్తున్నాయి. ఈ మూవీని పాన్ ఇండియా మూవీగా పలు భాషలకు చెందిన ప్రేక్షకులను ఆకట్టుకునేలా భారీ సెట్టింగ్‌లతో నిర్మిస్తున్నారు. కాగా ఈ మూవీలో మరో ఇద్దరు హీరోలు కూడా నటించనున్నటుట సమాచారం వెలువడింది.ఆ మేరకు విజయ్ సేతుపతి, రాఘవ లారెన్స్‌తో టాక్స్ జరుగుతున్నాయని తెలిసింది. అయితే వీరిద్దరూ విలన్‌గా నటిస్తారా? లేక ప్రధానమైన పాత్రల్లో నటిస్తారా? అనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. త్వరలో ఈ సస్పెన్స్‌కు తెరదించేలా అజిత్ అధికారికంగా ప్రకటన జారీ చేస్తారని చెబుతున్నారు.



లారెన్స్, విజయ్‌సేతుపతి

ఖైదీ-2 మూవీ ఏమైంది?



స్టార్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్, హీరో కార్తీ కాంబినేషన్‌లో 'ఖైదీ-2' మూవీ డ్రాప్ అయ్యిందా? దర్శకుడికి, నిర్మాణ సంస్థకు రెమ్యునరేషన్ విషయాల్లో గొడవలు తలెత్తాయా? ఆ కారణంగానే మూవీ షూటింగ్ ఆగిపోయిందా? గత రెండు మూడు నెలలుగా కోలీవుడ్‌లో ఈ చిత్రంపై పుకార్లు షికార్లు చేస్తున్నాయి. చివరకు వదంతుల్లో నిజం లేదని. దర్శకుడికి, నిర్మాతలకు మధ్య ఎలాంటి గొడవలు లేవని నిర్మాణ సంస్థ ప్రకటన జారీ చేసింది. అన్నివార్య కారణాల వల్ల ఈ మూవీ ప్రాజెక్టు వచ్చే యేడాది జనవరి నుండి ప్రారంభమవుతుందని నిర్మాణ సంస్థ నిర్వాహకులలు స్పష్టం చేశారు. హీరో కార్తీ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ఈ మూవీ కూడా ఖైదీ ఫస్ట్ పార్ట్ లాగే ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటుందని ఆయన చెప్పారు.

తిరుచెందూర్‌లో వెనక్కి మళ్లిన సముద్రం



నాచుతో దర్శనమిస్తున్న తీరం

ప్యారీస్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్‌లో బుధవారం సముద్రం వందడుగుల వెనక్కి మళ్లింది. అమావాస్య, పౌర్ణమి రోజుల్లో ఇక్కడ సముద్రం వెనక్కి వెళ్లి, కొన్ని గంటల తర్వాత యథాస్థాయికి చేరుకోవడం జరుగుతోంది. ఈ క్రమంలో, బుధవారం సముద్రం దాదాపు వందడుగులు వెనక్కి మళ్లడంతో పాచిపట్టిన బండరాళ్లు, సముద్రపు జీవులు బయటికి కనిపించాయి. అయినప్పటికీ భక్తులు ఆందోళన చెందకుండా సముద్ర స్నానాలు చేసి సుబ్రమణ్యస్వామి దర్శనం చేసుకున్నారు. కొంతమంది భక్తులు పాచిపట్టిన బండరాళ్ల వద్ద సెల్ఫీలు దిగారు.

కొడివేరి చెక్‌డ్యాంలో స్నానాలకు అనుమతి



ప్యారీస్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా కొడివేరి చెక్‌డ్యాం వద్ద వరద ఉధ్రుతి తగ్గడంతో 18 రోజుల అనంతరం సందర్శకులను బుధవారం స్నానాలకు అనుమతించారు. ఈరోడ్ జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గోపిచెట్టిపాళయం సమీపంలోవున్న కొడివేరి ఏడాది పొడవునా సందర్శకులతో రద్దీగా ఉంటుంది. ఈరోడ్ జిల్లా మాత్రమే కాకుండా కోవై, సేలం, తిరుచెంగోడు, నామక్కల్ ప్రాంతాల ప్రజలు ఈ డ్యాం సందర్శించేందుకు వస్తుంటారు. డ్యాం ప్రాంతంలో విక్రయించే చేపలు, రొయ్యలు పీతలను రుచి చూస్తుంటారు. ఈ నేపథ్యంలో, కొద్దిరోజులుగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో కురుస్తున్న భారీవర్షాల కారణంగా కొడివేరి చెక్‌డ్యాం వద్ద వరద ఉధ్రుతి అధికంగా ఉండటంతో ముందు జాగ్రత్త చర్యగా అక్టోబర్ 18 నుంచి సందర్శకులను స్నానాలకు నిషేధం విధించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పడటంతో కొడివేరి చెక్‌డ్యాం వద్ద వరద ఉధ్రుతి తగ్గడంతో, 18 రోజుల అనంతరం బుధవారం సందర్శకులను స్నానాలకు అనుమతించారు.



ధ్వజస్తంభం వద్ద మహాదీపారాధన చేస్తున్న ఆలయ ప్రధానార్చకులు

శంకరన్‌కోవిల్‌లో తిరుకల్యాణోత్సవాలకు శ్రీకారం

చెన్నై, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లాలోని సుప్రసిద్ధ శైవక్షేత్రం శంకరన్‌కోవిల్ శంకరనారాయణ స్వామి ఆలయంలో ఐప్పసి తిరుకళ్యాణ మహోత్సవం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. 12 రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో అమ్మవారు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వివిధ వాహనాలలో ఊరేగనున్నారు. ఈ యేడాదికి సంబంధించిన ఉత్సవాలు బుధవారం ఉదయం 6.05 గంటలకు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ముందుగా ఆలయ ప్రధానార్చకులు ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ధ్వజారోహణం, మహాదీపారాధన చేశారు. ఈ వేడుకలలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన తిరుకళ్యాణవైభవం ఈ నెల 15న జరుగనుంది.

ప్రజా గ్రీవెన్స్‌లో 18 వినతులు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న పోలీసు కమిషనర్ అరుణ్

చెన్నై, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీసు కమిషనర్ అరుణ్ ప్రజల నుంచి 18 వినతులు స్వీకరించారు. ఈ సమస్యలను విచారించి సత్వరం చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ప్రతి బుధవారం జరిగే ఈ గ్రీవెన్స్‌లో ప్రజలు పాల్గొని తమ సమస్యలు తెలిపి పరిష్కారం పొందాలని నగర పోలీసు కార్యాలయం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

సంగమేశ్వరుడికి ఘనంగా అన్నాభిషేకం



సంగమేశ్వరుడికి అలంకరణ - ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

తిరుత్తణి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తమిళ ఐప్పసి పౌర్ణమిని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న శైవక్షేత్రాల్లో అన్నాభిషేకాలు నిర్వహిస్తారు. ఈ క్రమంలో తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని సంగమేశ్వరాలయంలో స్వామివారికి ప్రత్యేక అన్నాభిషేకాన్ని ఆలయ అర్చకులు నిర్వహించారు. ఉదయం తెల్లవారుజాము నుంచి నుండి భక్తులు స్వామివారి దర్శనానికి తరలిరావడంతో ఆలయ ప్రాంగణాలు కిటకిటలాడాయి. అనంతరం వేదమంత్రోచ్చారణ, మేళతాళాలు, దివ్యనామస్మరణ మధ్య అర్చకులు స్వామివారికి అన్నాభిషేకం చేశారు. అనంతరం 1500 మంది భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

రామేశ్వరం హుండీ ఆదాయం రూ.1.67 కోట్లు

అడయార్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం రామనాథ స్వామివారి హుండీ ఆదాయం రూ.1.67 కోట్లు వచ్చినట్టు అధికారులు తెలిపారు. ప్రపంచ ప్రసిద్ధిచెందిన రామేశ్వరం రామనాథస్వామి ఆలయానికి ప్రతిరోజు పొరుగు జిల్లాలు, రాష్ట్రాలు, విదేశాలకు నుంచి భక్తులు వస్తుంటారు. స్వామివారి దర్శనానంతరం భక్తులు హుండీలో కానుకలు వేస్తుంటారు. భక్తుల 15 రోజుల పాటు వేసిన హుండీ కానుకల లెక్కింపు మంగళవారం ప్రారంభమై బుధవారం ముగిసింది. మొత్తం రూ.1.67 కోట్ల నగదు, 35 గ్రాముల బంగారం, 4 కిలోల వెండి భక్తులు కానుకగా సమర్పించారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.





స్వామివారికి దీపారాధన

పెరువుడయార్‌కు వెయ్యి కిలోల అన్నాభిషేకం

అడయార్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తంజావూరు పెరువుడయార్ అన్నాభిషేకం వేడుకలు వైభవంగా జరిగాయి. ప్రతి ఏటా ఐప్పసి నెల పౌర్ణమి సందర్భందా పరమేశ్వరుడికి అన్నాభిషేకం నిర్వహిస్తుంటారు. ఆ ప్రకారం, ఐప్పసి పౌర్ణమి సందర్భంగా బుధవారం తంజావూరు బృహదీశ్వరాలయంలో ఉన్న పెరువుడయార్‌కు పంచామృతం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం భక్తులు అందజేసిన 1,000 కిలోల అన్నం, 500 కిలోల కాయగూరలతో ప్రత్యేక అభిషేకం, మహా దీపారాధన చేశారు. వేలాది మంది భక్తులు స్వామి దర్శనం చేసుకున్నారు. రాత్రి అభిషేకానికి వినియోగించిన అన్నాన్ని భక్తులకు ప్రసాదంగా అందజేశారు.



శ్రీవారి సేవలో రాజు సుందరం

తమిళనటుడు, కొరియో గ్రాఫర్ రాజు సుందరం బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



మంత్రి లోకేశ్‌ను కలిసిన మిట్స్ విజయభాస్కర్

కురబలకోట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మంత్రి నారా లోకేశ్‌ను డీమ్డ్ టు బి మిట్స్ చాన్సలర్ ఎన్.విజయభాస్కర చౌదరి కలిశారు.అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు ఇటీవల డీమ్డ్ టు బి మిట్స్ యూనివర్శిటీగా అవకాశం రావడంతో చాన్సలర్ ఎన్.విజయభాస్కర చౌదరి విజయవాడలో మంత్రిని కలిసి కళాశాలలో విద్యావిధానాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. యూనివర్శిటీలో అందిస్తున్న ఉన్నత విద్య, డిజిటల్ ఆవిష్కరణలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలలో తమ యూనివర్శిటీ సాధించిన పలు అంశాలు, నాణ్యమైన విద్య, అధ్యాపకుల మౌలిక సదుపాయాల గురించి తెలియజేశారు. దీంతో విజయభాస్కర చౌదరిని మంత్రి నారా లోకేశ్ అభినందించారు.

వరదయ్యపాళెం ఎంపీపీ రాజీనామా ఆమోదం

వరదయ్యపాళెం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం ఎంపీపీ పద్మప్రియ రాజీనామాను ఆమోదిస్తూ కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాలు జారీ చేశారు. ఆమె స్థానంలో బొప్పన పద్మావతిని ఇన్‌చార్జిగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువరించారు. పలు నాటకీయ పరిణామాల మధ్య ఎంపీపీ పదవికి పద్మప్రియ రాజీనామా చేశారు. దీంతో వైస్ఎంపీపీ పద్మావతి ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు చేపట్టారు.


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.42 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 67,091

తలనీలాలు సమర్పించినవారు: 21,111





వెలుగుల స్వర్ణముఖి

శ్రీకాళహస్తీశ్వరాలయం పక్కన స్వర్ణముఖి నదిలో భక్తులు నేతి దీపాలు వెలిగించి గంగాదేవికి సమర్పించారు. దీంతో స్వర్ణముఖినదీ తీరప్రాంతం ఎటు చూసినా నేతిదీపపు కాంతులతో ఆధ్యాత్మికను సంతరించుకుంది.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

యోగుల పర్వతంపై దీపోత్సవం



కార్తీక దీపాన్ని వెలిగిస్తున్న ప్రతాప్‌స్వామి

వడమాలపేట మండలం బాలినాయుడుకండ్రిగ సమీపంలోని యోగుల పర్వతంపై బుధవారం దీపోత్సవం నిర్వహించారు. ఏకవీర సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరు అడుగుల కొప్పెరలో 1502 కిలోల నెయ్యి ఏర్పాటు చేసిన దీపాన్ని సంస్థ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామి వెలిగించారు. భక్తుల శివనామ స్మరణలతో యోగుల పర్వతం మార్మోగింది.

- వడమాలపేట, ఆంధ్రజ్యోతి

కపిలేశ్వరాలయానికి పోటెత్తారు



కపిలేశ్వరస్వామి ఆలయం వద్ద క్యూలో బారులు తీరిన భక్తులు

కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం జిల్లాలోని శివాలయాలు రద్దీగా మారాయి. జలపాతాల వద్దా జనసందడి కనిపించింది. ఉదయం నుంచి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు సాయంత్రం కార్తీక దీపాలు వెలిగించారు. తిరుపతి నగరం కపిలేశ్వరుడి దర్శనానికి భక్తులు పోటెత్తారు. రద్దీని ఊహించి టీటీడీ అధికారులు ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేశారు. పోలీసులు పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టారు. స్వామి, అమ్మవార్లకు అన్నాభిషేకం నిర్వహించారు. అన్నంతో రూపొందించిన ఉత్సవర్లను కపిలతీర్థంలో మునక వేయించారు. ఇక, సాయంత్రం ఆలయ సమీపంలోని ఉద్యానవనంలో భక్తులు కార్తీక పౌర్ణమి దీపాలు వెలిగించారు.

- తిరుపతి (కల్చరల్), ఆంధ్రజ్యోతి





అన్నాభిషేకమూర్తులను పుష్కరిణిలో మునక వేయిస్తున్న అర్చకులు - కపిలేశ్వరాలయం పక్కన ఉద్యానవనంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఎస్వీయూలో ర్యాగింగ్ వ్యతిరేక ర్యాలీ

- సైకాలజీ ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డిని తొలగించాలని విద్యార్థి సంఘాల డిమాండ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పోలీసు భద్రత నడుమ ఎస్వీయూలో విద్యార్థి సంఘాలు బుధవారం ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన ర్యాలీ నిర్వహించాయి. ఎస్వీయూలో ర్యాగింగ్ వ్యవహారం చినికి చినికి గాలివానగా మారుతోంది. ర్యాగింగ్‌ను ప్రోత్సహించిన సైకాలజీ ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డిని ఉద్యోగం నుంచి తొలగించాలని విద్యార్థి సంఘాలు నినదించాయి. అనంతరం గోల్డెన్ జూబ్లీ ఆర్చి ముందు బైఠాయించి నిరసన తెలిపారు. విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ సైకాలజీ ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డి స్వయంగా తరగతిలో కూర్చొని సీనియర్ విద్యార్థులతో జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేయించాడని ఆరోపించారు. ఆయన్ను వెంటనే ఉద్యోగం నుంచి తొలగించాలని కోరారు. విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసులకు చేసిన ఫిర్యాదును



ఎస్వీయూ మెయిన్ గేట్ వద్ద విద్యార్థి సంఘాల నిరసన

ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్, ఎస్ఎఫ్ఐ వర్సిటీల కన్వీనర్ అశోక్ కుమార్, ఎస్వీయూ అధ్యక్ష, కార్యదర్శులు నరసన్న, వినోద్, పీడీఎస్‌వో జిల్లా కార్యదర్శి ఆశ, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు శివబాలాజీ, లా విద్యార్థుల సంఘం అధ్యక్షుడు సుందరరాజు, జీఎస్ఎస్ నేత శివశంకర్ నాయక్, జేబీఎస్ఎఫ్ కన్వీనర్ భార్గవ్, పవిత్ర, అనిత, తిరుమలేష్, షేక్‌షా, మన్సూర్, చందు నాయక్, తిప్పేస్వామి, ఆదిత్య, అభిషేక్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

సీసీ టీవీ ఫుటేజీలు చూపండి

- బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు

ర్యాగింగ్ వ్యవహారంలో బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు గొంతు విప్పారు. ర్యాగింగ్‌ను ప్రోత్సహించిన ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ చూపించాలని కోరారు.

ముగిసిన విచారణ

సైకాలజీ విభాగంలో చోటు చేసుకున్న ర్యాగింగ్ వ్యవహారంపై ఏర్పాటు చేసిన కమిటీ విచారణ ప్రక్రియను పూర్తి చేసింది. యూనివర్సిటీ అధికారులకు నివేదికను సమర్పించింది. దాన్ని రాష్ట్ర ఉన్నత విద్యా మండలికి యూనివర్సిటీ అధికారులు పంపారు. ప్రభుత్వ నిర్ణయాన్ని అనుసరించి తదుపరి చర్యలు తీసుకునే అవకాశముంది.

కరుడు కట్టిన స్మగ్లర్ అరెస్టు

- కారు సహా ఎర్రచందనం స్వాధీనం

ఎర్రావారిపాలెం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కరుడు కట్టిన ఎర్రచందనం స్మగ్లర్‌ను అరెస్టు చేసి కారుతో సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొన్నట్లు భాకరాపేట రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. రేంజ్ ఆఫీసర్ కథనం మేరకు.. తిరుపతి - అన్నమయ్య జిల్లా సరిహద్దు గ్రామం పించా నుంచి చెన్నైకు ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతుందని రహస్య సమాచారం ఉంది. దీంతో ఉస్తికాయలపెంటలో తమ సిబ్బంది నిఘా ఉంచారు. బుధవారం వేకువజామున పించా నుంచి ఎల్లమంద వైపు అతివేగంగా వస్తున్న కారును ఆపేందుకు ప్రయత్నించగా అతివేగంగా వెళుతూ ఎల్లమంద ఎస్సీ కాలనీ వద్ద కల్వర్టును ఢీకొని ఆగిపోయింది. ఈ క్రమంలో కారులో వున్న వ్యక్తిని పట్టుకొని, కారును పరిశీలించగా 114 కేజీల బరువున్న 5 ఎర్రచందనం దుంగలు ఉన్నాయి. నిందితుడిని విచారించగా 2022 ఫిబ్రవరి 6వతేదీన కేవీ పల్లె మండలంలో కారుతో గుద్దడంతో టాస్క్‌ఫోర్సు కానిస్టేబుల్ గాయపడి చనిపోయిన కేసులో నిందితుడిగా తేలిందని ఎఫ్ఆర్వో వెంకట్రమణ తెలిపారు. పట్టుబడిన వ్యక్తి తమిళనాడుకు చెందిన రామన్ చిన్నయ్యన్‌గా గుర్తించినట్లు తెలిపారు. ఈ దాడిలో అధికారులు మునస్వామి నాయక్, లక్ష్మీ ప్రసాద్, రాజేష్, సదాశివయ్య తదితరులు పాల్గొన్నారన్నారు.

తిరుమలలో అస్వస్థతకు గురైన మహిళ మృతి



మృతి చెందిన మహిళ

తిరుమల, నవంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గత ఆదివారం అస్వస్థతకు గురైన ఓ మహిళ మృతి చెందింది. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. 40 ఏళ్ల వయస్సు కలిగిన మంగ అనే మహిళ ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ప్రధాన కల్యాణకట్ట ముందున్న షెడ్‌లో మూర్ఛతో కుప్పకూలిపోయింది. 108 అంబులెన్స్ ద్వారా తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి తిరుపతికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఆమె మృతి చెందినట్లు బుధవారం ఒక ప్రకటనలో పోలీసులు తెలిపారు. పేరు తప్ప ఆమె వివరాలేవీ తెలియదని పేర్కొన్నారు. మృతదేహాన్ని తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజీ మార్చురీకి తరలించారు. వివరాలు తెలిసిన వారు 94407 796768 నెంబరుకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

ఎలక్ట్రీషియన్లకు జర్మనీలో ఉద్యోగావకాశాలు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఇతర సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో నైపుణ్యం కలిగిన ఎలక్ట్రీషియన్లకు జర్మనీలో ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ లోకనాథం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ లేదా డిప్లమో చేసి, 30ఏళ్ల లోపు వారు అర్హులని వెల్లడించారు. కనీసం రెండు సంవత్సరాలు పనిచేసిన అనుభవం ఉండాలని తెలిపారు. ఈ నెలలో రాజమండ్రిలో జర్మనీ భాషపై అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9160912690ను సంప్రదించాలని కోరారు.

ట్రేడింగ్ యాప్ పేరుతో రూ.1.50 కోట్లు కొట్టేశారు

తిరుపతి (నేరవిభాగం) నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ట్రేడింగ్ యాప్ పేరుతో రూ.1.50 కోట్లు కొట్టేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తిరుపతి వెస్ట్ సీఐ మురళీ మోహన్ వివరాల మేరకు.. తిరుపతి ఎయిర్‌బైపాస్ రోడ్డులోని డీమార్ట్ సమీపంలో ఉంటున్న చైతన్య కుమార్, వెంకటేష్ కువైట్‌కు వెళ్లి కొంత డబ్బు సమకూర్చుకుని వచ్చారు. ఇక్కడ ఆన్‌లైన్ వ్యాపారాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆన్‌లైన్ ద్వారా ఒక గుర్తు తెలియని వ్యక్తితో వీరికి పరిచయమైంది. అంగారి ట్రేడ్ యాప్‌లో పెట్టుబడిపెడితే రెండింతలు లాభాలు వస్తాయని సదరు వ్యక్తి చెప్పి నమ్మించాడు. దీంతో వారు కోటి రూపాయలు పెట్టుబడి పెట్టారు. ఎంతసేపు చూసినా డబ్బు అకౌంట్లో పడకపోవడంతో సదరు వ్యక్తికి ఫోన్ చేశారు. స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయామని గుర్తించి తిరుపతి వెస్ట్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సీఐ మురళీమోహన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

11, 12 తేదీల్లో ఆలిండియా సివిల్ సర్వీస్ క్రీడా పోటీలు

తిరుపతి(క్రీడలు), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 11, 12 తేదీల్లో ఆలిండియా సివిల్ సర్వీస్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీవో శశిధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్, షటిల్, బాడ్మింటన్, చెస్, లాన్ టెన్నిస్, హాకీ, టేబుల్‌టెన్నిస్, కబడ్డీ, క్యారం, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, ఖోఖో, క్రికెట్, వెయిట్, పవర్ లిఫ్టింగ్, బెస్ట్‌ఫిజిక్స్ స్విమ్మింగ్, వాలీబాల్, యోగా, డ్యాన్స్, మ్యూజిక్ సంబంధించి పోటీలు ఎస్వీ తారకరామ స్టేడియంలో జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు ఈ నెల 8వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ పోటీలలో ఎంపికైనవారు ఈనెల 19నుంచి 22వ తేదీ వరకు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని, మరిన్ని వివరాలకు 9059606346, 9966882029లను సంప్రదించాలని కోరారు.

9 మంది స్మగ్లర్ల అరెస్టు

- 20 ఎర్రచందనం దుంగల స్వాధీనం

మంగళం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి అటవీ పరిధిలో బుధవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి 9 మంది స్మగ్లర్లను అరెస్టు చేసి, 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఏఆర్ఎస్ఐ ఈశ్వరరెడ్డి బృందం శ్రీకాళహస్తి అటవీ పరిధిలో కూంబింగ్ నిర్వహిస్తుండగా బుధవారం తెల్లవారుజామున రాగిగుంట సెక్షన్, తీర్థాల పాలకోనలో కొంత మంది వ్యక్తులు గుమికూడి ఉండటాన్ని గమనించారు. పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా వెంబడించి తొమ్మిది మందిని పట్టుకున్నారు. పరిసర ప్రాంతాల్లో దాచి ఉంచిన 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వారిలో ఇద్దరు తిరుపతి జిల్లా, ఏడుగురు తమిళనాడుకు చెందిన వారుగా గుర్తించారు. స్మగ్లర్లను, ఎర్రచందనాన్ని తిరుపతి టాస్క్‌ఫోర్సు కార్యాలయానికి తరలించి, ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మీరూ రాష్ట్రానికి వచ్చి

వైద్యసేవలు అందించండి

- లండన్‌లో స్విమ్స్ మాజీ వైద్యుడికి సీఎం చంద్రబాబు సూచన



సీఎం చంద్రబాబును కలిసిన డాక్టర్ కళ్యాణ్

తిరుపతి(వైద్యం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): 'మీ తండ్రి గుడారు జగదీష్ గతంలో.. ఇప్పుడు బర్డ్ ఆస్పత్రిలో చక్కటి వైద్యసేవలను అందిస్తున్నారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని మీరు స్వదేశానికి వచ్చి మన రాష్ట్ర ప్రజలకు వైద్యసేవలు అందించండి. 'మీలాంటి అనుభవం, నైపుణ్యం కలిగిన వైద్యులు ఎంతో అవసరం' అంటూ లండన్‌లో స్థిరపడ్డ స్విమ్స్ మాజీ వైద్యుడు డాక్టర్ గుడారు కళ్యాణ్‌కు సీఎం చంద్రబాబు సూచించారు. లండన్ పర్యటనకు వెళ్లిన సీఎం నారా చంద్రబాబునాయుడు, భువనేశ్వరి దంపతులను గతంలో స్విమ్స్‌లో పనిచేసిన వైద్యుడు, లండన్ కింగ్స్ అండ్ గయ్స్ హాస్పిటల్లోని కిడ్నీ వైద్య విభాగాధిపతి డాక్టర్ గుడారు కళ్యాణ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. లండన్‌లో అందిస్తున్న వైద్యసేవలు, అధునాతన వైద్యపద్ధతులను, అక్కడి కళ్యాణ్ అనుభవాల గురించి సీఎం చంద్రబాబునాయుడు అడిగి తెలుసుకున్నారు. లండన్‌లో అందుబాటులో ఉన్న రోబోటిక్ అధునాతన వైద్య పద్ధతులను ఆయన సీఎంకు వివరించారు.



రాష్ట్రస్థాయి సైన్స్ డ్రామా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సైన్స్ డ్రామాలు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తాయి

- డీఈవో కేవీఎన్ కుమార్

తిరుపతి(విద్య), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సైన్స్ డ్రామాలు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తాయని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ పేర్కొన్నారు. విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం సౌజన్యంతో జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సైన్స్‌డ్రామా పోటీలు తిరుపతి పద్మావతి బాలికోన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. డీఈవో ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సమస్యలపై అవగాహన పెంచుకుని సృజనాత్మకంగా ఆలోచించి పరిష్కారాలు తెలుసుకునేలా సైన్స్ డ్రామాలు విద్యార్థులను తీర్చిదిద్దుతాయని చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల నుంచి 12 జట్లు పాల్గొన్నాయి. తిరుపతి ఎస్‌కేఆర్ ఉన్నత పాఠశాలకు చెందిన మోక్షజ్ఞ బృందం ప్రదర్శించిన 'బెనిఫిట్ ఆఫ్ మ్యాన్ కైండ్' మొదటి బహుమతి, ఎస్జీఎస్ ఉన్నత పాఠశాలకు చెందిన హారిక బృందం ప్రదర్శించిన 'స్మార్ట్ అగ్రికల్చర్' డ్రామా రెండవ బహుమతి గెలుచుకున్నాయి. ఇవి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. వీటితో పాటు ఎస్వీ ఓరియంటల్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రదర్శన 'క్లీన్‌నెస్' తృతీయ, 'స్మార్ట్ అగ్రికల్చర్' ప్రదర్శన నాల్గవ స్థానాల్లో నిలిచి ప్రోత్సాహక బహుమతులు అందుకున్నాయి. ప్రథమ బహుమతికి రూ.1000, ద్వితీయకు రూ.750, తృతీయకు రూ.500, నాల్గవ బహుమతిగా రూ.250 నగదు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. పద్మావతి బాలికల పాఠశాల హెచ్ఎం పద్మావతి పాల్గొన్నారు.

స్మార్ట్‌సిటీ ఎక్స్‌పోలో కమిషనర్

తిరుపతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : స్పెయిన్‌లో జరుగుతున్న ప్రపంచ స్మార్ట్‌సిటీ కాంగ్రెస్ ఎక్స్‌పోలో తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పాల్గొన్నారు. స్పెయిన్‌లోని బార్సిలోనా పట్టణంలో ప్రపంచ స్మార్ట్‌సిటీ కాంగ్రెస్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నారు. ఈ ఎక్స్‌పోకు మౌర్యతోపాటు ఏపీ తరఫున రాష్ట్ర పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, విశాఖపట్నం కమిషనర్ కేతన్ భార్గవ్ పాల్గొన్నారు. మూడు రోజులపాటు ఈ ఎక్స్‌పో జరుగుతుంది.

